పాడి రైతుల ఆందోళన

- పెండింగ్‌లో రెండు నెలల బిల్లులు
- పాడి పశువులు, గేదెల పోషణకు తప్పని తిప్పలు
- రోడ్డెక్కుతున్న పాడి రైతులు



ఉప్పునుంతలలో రోడ్డుపై పాలను పారబోస్తూ నిరసన తెలుపుతున్న పాడి రైతులు (ఫైల్)



ఉప్పునుంతలలో పాల సేకరణ కేంద్రం

ఉప్పునుంతల: వ్యవసాయానికి అనుబంధంగా రైతులు గేదెలను, పాడి ఆవులను పెంచుతూ వచ్చే పాల డబ్బులతో పిల్లల చదువులు, ఇంటి అవసరాలు తీర్చుకుంటున్నారు. కొంతమంది రైతులు పరిమితంగా ఒకటి రెండు ఆవులు, గేదెలను పోషిస్తూ వచ్చే పాడి ద్వార ఆదాయం పొందుతుంటే మరికొంత మంది రైతులు అధిక పెట్టుబడులతో షెడ్డులను ఏర్పాటు చేసుకొని పదుల సంఖ్యలో ఆవులు, గేదెలను పెంచుతూ ఆదాయాన్ని పొందుతున్నారు. పాలతో వచ్చే డబ్బులతో వ్యవసాయ పెట్టుబడులు వెళ్లదీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత ఆరు నెలల నుంచి పాడి రైతులు బిల్లులు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజులకు ఒక సారి అందాల్సిన బిల్లులు నెలల తరబడి జాప్యం చేస్తుండటంతో అవసరాలు తీరక అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం రెండు నెలల బిల్లులు పెండింగ్‌లు ఉన్నాయి. ఇలా అలస్యం చేస్తూ 15 రోజుల బిల్లు ఇస్తే అది ఏమాత్రం సరిపోక ఇతరుల వద్ద అప్పులు చేయాల్సి వస్తుందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఉప్పునుంతల మండల కేంద్రంలో పాడి రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతోపాటు పాలను రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తంచేశారు. మండల కేంద్రంలోని రెండు సెంటర్లతోపాటు మండలంలోని మొత్తం 15 సెంటర్ల నుంచి రోజుకు దాదాపుగా 5 వేల లీటర్ల వరకు అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రానికి పాలు చేరుతున్నాయి. ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఇస్తున్న లీటరుకు రూ. 4తో కలిపి పాలలో వెన్నశాతాన్నిబట్టి ఆవు పాలకు లీటరుకు రూ. 40.25 ల నుంచి రూ. 46.95ల వరకు ఇస్తున్నారు. అదేవిధంగా గేదె పాలకు లీటరుకు రూ. 40 నుంచి రూ. 86ల వరకు రైతులు పొందుతున్నారు. ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని సకాలంలో పాల బిల్లులను అందజేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

పాడి రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న పాడి రైతులు

వెల్దండ: పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ శనివారం మండల కేంద్రంలోని పాల కేంద్రం ఎదుట పాడి రైతులు నిరసన తెలిపారు. రైతులకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులు విజయ డెయిరీకి పాలుపోస్తున్న రైతులకు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి చెల్లించే పాలబిల్లులను ప్రభుత్వం పెండింగ్ పెట్టడంతో రైతులు అవస్థలు పడుతున్నారని వివరించారు. దాదాపుగా నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు రైతులు పేర్కొన్నారు. సమస్యలను విజయడెయిరీ అధికారులకు వివరించగా త్వరలో పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, గెల్వయ్య పాడి రైతులు తదితరులు ఉన్నారు.

ఆవుల పోషణ ఇబ్బందిగా మారింది



పాల బిల్లులు పెండింగ్ పెట్టడంతో పాడి ఆవుల పోషణ ఇబ్బందిగా మారింది. ఆరు ఆవుల పోషణకు నెలకు రూ. 20 వేల ఖర్చు వస్తోంది. రెండు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉంచి పదిహేను రోజులకు సంబంధించిన ఒక బిల్లు ఇస్తే ఆ డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదు. రోజుకు 30 లీటర్ల పాలు సెంటర్‌కు పోస్తాను. రూ. 60 వేలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

– మదనాగుల శివశంకర్, పాడి రైతు, ఉప్పునుంతల

సకాలంలో పాల బిల్లులు ఇవ్వాలి



ఇంతకుముందు మాదిరిగా పదిహేను రోజులకు ఒకసారి పాల బిల్లు ఇవ్వాలి. పశువులు, గేదెల పోషణకు ఖర్చుపోను మిగిలిన డబ్బులతో ఇంటి అవసరాలు తీర్చుకుంటాం. మాకు రూ. 50 వేల వరకు పాల బిల్లు రావల్సి ఉంది. గత ఆరు నెలల నుంచి పాల బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదు. మే నెల మొదటి బిల్లు జూన్ నెలాఖరుకు ఇచ్చారు.

– గుజ్జుల రాంబాబు, పాడి రైతు, ఉప్పునుంతల

నాలుగు బిల్లులకు ఒక బిల్లు ఇచ్చాం

ఆరు నెలల నుంచి పాల బిల్లులు సకాలంలో రావడంలేదు. మే, జూన్ నెలలకు సంబంధించిన నాలుగు బిల్లులలో రెండు రోజుల కిందట ఒక బిల్లు రైతుల ఖాతాలలో జమ అయ్యాయి. ఇక మూడు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో పెండింగ్ బిల్లులు అందజేస్తాం.

– కృష్ణ, మేనేజర్, పాల శీతలీకరణ కేంద్రం, అచ్చంపేట

క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ

నాగర్‌కర్నూల్(తెలకపల్లి): మండలంలోని గౌరారం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. హ్యూమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఫౌండర్ చింతపల్లి శివశంకర్ 100 మంది విద్యార్థులకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

హిందూ సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పలు గ్రామాల హిందువులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ఐక్య వేదికను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం విశ్వ హిందూపరిషత్ మండల నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి హిందువులపై జరిగే భౌతికదాడులను ఎదుర్కొనేందుకు ఐక్య వేదిక పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, రఘుపతిరెడ్డి, శేఖర్, జనార్దన్, తిరుపతయ్య, గువ్వల వెంకటయ్య, దామోదర్‌గౌడ్, కృష్ణారావు, నరేందరాచారి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం పాటను ఆపాలి

సాక్షి, నెట్‌వర్క్: బొగ్గు గనుల వేలం పాటను నిలపాలని శనివారం బల్మూర్ మండల కేంద్రంలోని అచ్చంపేట ప్రధాన రహదారిపై సీపీఎం నాయకులు రాస్తారోకో చేపట్టారు. అదేవిధంగా వంగూరు మండల కేంద్రంలోని బ్యాంకు చౌరస్తాలో నిరసన తెలిపారు. కోడేరు బస్టాండ్‌లో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బొగ్గుగనులను నిలిపివేయాలని తాడూరు తహసీల్దార్ ప్రమీలకు సీపీఎం మండల కార్యదర్శి కాశన్న వినతిపత్రం అందజేశారు. శంకర్ నాయక్, లాల్‌అహ్మద్, ఆంజనేయులు, మధు, మాసయ్య, సలేశ్వరం, ఆంజనేయులు, బాలస్వామి, శివరాములు ఉన్నారు. మండల కార్యదర్శి నరసింహ, రాజేష్, శ్రీను, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వెల్దండ: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శనివారం వెల్దండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బొల్లంపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన జంగయ్యగౌడ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మండల అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, రాహుల్ తదితరులు ఉన్నారు.

కృష్ణానదిలో అలివి వలలకు అడ్డుకట్ట వేయాలి



నాగర్‌కర్నూల్(కొల్లాపూర్): కృష్ణానదిలో అలివి వలలతో చేపల వేటకు అడ్డుకట్ట వేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు కోరారు. శనివారం సహకార సంఘం సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలో మత్స్యశాఖ ఏడీ రెహమాన్‌కు కలిసి విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణానదిలో ప్రతి సంవత్సరం ప్రభుత్వం దాదాపు 4.5 కోట్ల చేపపిల్లలను వదులుతోందని, వాటిని కొందరు వ్యాపా రులు అలివి వలలతో వేటాడుతున్నారని ఏడీకి వివరించారు. చిన్నంబావి మండలంలోని అయ్య వారిపల్లి నుంచి కొల్లాపూర్ మండలం అమరగిరి, శ్రీశైలం బ్యాక్‌వాటర్ ప్రాంతాల్లో అలివి వేట యథేచ్ఛగా సాగుతోందన్నారు. వాటిని అరికట్టకుంటే సంప్రదాయ మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజి, డైరెక్టర్లు వెంకటయ్య, నర్సింహ్మ, వెంకటయ్య, ఈశ్వర్, సత్యనారాయణ, మంజులరాముడు, బంగారయ్య, బాల్‌చందర్, నరేష్, విష్ణు ఉన్నారు.

కొనసాగుతున్న అడ్మిషన్లు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2వ తేదీ నుంచి దోస్త్ అడ్మిషన్ ఫేజ్–3 రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారని.. 3వ తేదీలోగా వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో బీఏ(హెచ్ఈపీ, హెచ్‌పీపీ, ఈపీపీ, హెచ్‌పీసీఏ), బీకాం కంప్యూటర్స్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం, హెచ్‌ఈపీ ఉర్దూ మీడియం కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అడ్మిషన్లు పొందాలని సూచించారు. దోస్త్ అడ్మిషన్లకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే, కళాశాలలోని దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

అర్హులైన రైతులందరికీ రైతు భరోసా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇచ్చేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం ఏర్పాటు చేసిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడిసాయం అందిస్తామని, ఆగస్టు 15 వరకు రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి చంద్రశేఖర్, పీఏసీస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, మాజీ చైర్మన్ మద్దు నరేందర్‌రెడ్డి, నాయకులు కట్టా అనంతరెడ్డి, ఎంపీడీఓ బాల చందర్ సుజన్, ఏఓ సునీత, ఏఈఓలు, పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అచ్చంపేటను అగ్రగామిగా నిలబెడతా

వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. 4న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగుస్తుండడంతో వారందరికీ ఎమ్మెల్యే పూలమాలలు వేసి సన్మానించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, జెడ్పీటీసీ సభ్యులు కేవీఎస్‌రెడ్డి, ఎంపీపీ భీమమ్మ లాలూయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంధ్యారాణి, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట(బల్మూర్): మండలంలోని కొండనాగులు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా మహా జనసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. సింగిల్ విండో చైర్మన్ నర్సయ్య, ఎంపీపీ అరుణ, సీఈఓ రాజవర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు. బల్మూరు మండలంలోని అంబగిరిలో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం భవనానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, చుక్కారెడ్డి, నర్సింగ్‌రావు, ఆవుల తిరుతపయ్య, శ్రీనయ్య పాల్గొన్నారు.

అచ్చంపేట(అమ్రాబాద్): అమ్రాబాద్ మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. ముందుగా అధికారులు వివిధ శాఖల వారిగా చేపట్టాల్సిన పనులు, పురోగతి పనులను రివ్యూ చేశారు. నల్లమల ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చుతామన్నారు. రూ.29 కోట్ల వ్యయంతో సమీకృత భవన సముదాయం నిర్మించేందుకు స్థల పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ శ్రీనివాసులు, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, ఎంపీడీఓ మోహన్‌లాల్, తహసీల్దార్ సరిత, ఎంపీఈఓ వెంకటయ్య, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

అచ్చంపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ 2022లో పెంచిన ఏరియర్స్ రూ.7 వేలు ఇవ్వాలన్నారు. 30 సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి కారణం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులందరూ విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు లక్ష్మణ్, వెంకటయ్య, భాస్కర్, పాండు, కృష్ణమ్మ, శాంతమ్మ, జ్యోతి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సేవతోనే సమాజంలో గుర్తింపు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న గామా ఫౌండేషన్ సిబ్బంది

నాగర్‌కర్నూల్(కోడేరు): సేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని గామా ఫౌండేషన్ సీఈఓ దుర్గప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఖానాపూర్‌లో గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోఆర్డనేటర్ చంద్రయ్య, ఎంపీటీసీ దేవమ్మలతో కలిసి పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవ కార్యక్రమాలు విస్తృతం చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకున్న వారికి ప్రతి నెల సరుకులు, జీవనభృతి కింద రూ.1000 ఆర్థికసాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, గ్రామ కోఆర్డినేటర్ రామకృష్ణ, అర్జునయ్య, దానయ్య, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్(తెలకపల్లి): మండలంలో ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ విజయనిర్మల శనివారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆర్డీఓకు..

నాగర్‌కర్నూల్(కొల్లాపూర్): పట్టణంలోని ఎస్టీ మేనేజ్‌మెంట్ హాస్టల్‌కు స్వంత భవనం నిర్మించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు ధారా శేఖర్, గిరిజన సంఘం పట్టణ అధ్యక్షుడు తిరుపతినాయక్ శనివారం ఆర్డీఓ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్తీక్, సాయికుమార్, గణేష్, నాగరాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు..

నాగర్‌కర్నూల్: శ్రీపూర్ రోడ్డు సమీపంలో ఉన్న బీసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత, మండల కార్యదర్శి అశోక్, నాయకులు రాఘవేంద్ర, సురేష్, భవాని పాల్గొన్నారు.

పశువుల సంత వేలం



మున్సిపల్ కార్యాలయం వేలంలో పాల్గొన్న చైర్మన్, కమిషనర్, టెండర్‌దారులు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పశువుల సంతకు సంబంధించి టెండర్ పక్రియను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ నిర్వహించారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో పశువుల సంత, తైబజార్‌కు సంబంధించిన వేలాన్ని మున్సిపల్ చైర్మన్ సత్యం ఆధ్వర్యంలో పలువురు టెండర్ దారులు వేలంలో పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 9 నెలలకు గాను పశువుల సంతను జితేందర్ రూ.87.37 లక్షలకు, తైబజార్ శ్రీనివాస్ రూ.15.56 లక్షలకు దక్కించుకున్నారు. వైస్ చైర్మన్ షాహెద్, మేనేజర్ రాజకుమారి, కౌన్సిలర్లు, టెండర్ దారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డైరెక్టర్‌గా మల్లి సలేశ్వరం

అచ్చంపేట(లింగాల): నల్లమల ప్రాంతంలోని శ్రీశైలం ఉత్తర ద్వారమైన పుణ్యక్షేత్రం ఉమామహేశ్వర దేవస్థానం పాలక మండలిలో లింగాలకు చెందిన మల్లి సలేశ్వరం డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

నాగర్‌కర్నూల్(తాడూరు: మండలంలోని ఇంద్రకల్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో 10 వ తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు, పరుగు పందెం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర అధక్షుడు పోల శ్రీనివాసులు నగదు బహుమతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, త్యాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

అంతయ్య ఆశయాలు కొనసాగిస్తాం



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్: అంతయ్య ఆశయాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. అంతయ్య వర్ధంతిని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పర్వతాలు మాట్లాడుతూ అచ్చంపేట డివిజన్ కార్యదర్శిగా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న అంతయ్యను 1992లో నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ రేట్ల పెంపు పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు, మండల కార్యదర్శి అశోక్, రామయ్య, సత్యనారాయణ, నర్సింహ, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్(కొల్లాపూర్): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అంతయ్యకు సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ నివాళులు అర్పించారు.

అచ్చంపేట: మండలంలోని సింగారంలో అంతయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉప్పునుంతల వాసికి డాక్టరేట్ ప్రదానం



గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకుంటున్న కొత్త చిన్న జంగిరెడ్డి



డాక్టరేట్ పొందిన సుగుణ

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన కొత్త యశోద ఫంక్షన్‌హాల్ యజమాని కొత్త చిన్న జంగిరెడ్డికి శనివారం డాక్టరేట్ దక్కింది. సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహిస్తుండటంతో అందుకు గుర్తింపుగా జంగిరెడ్డిని అవార్డుకు ఎంపికచేశారు. ఈ మేరకు తమిళనాడులోని హోసూరులో ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ వేదిక్ రీసెర్చ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏషియా కల్చరల్ అకాడమి ఫౌండర్ బాబు విజయన్, ఐఎన్‌టీయూసీ తమిళనాడు వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేఏ మనోకరన్ డాక్టరేట్ అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ జడ్జి డాక్టర్ కె హరిదాస్, డాక్టర్ రవి చంద్రన్, చేరాల ప్రకాశ్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్(తెలకపల్లి): మండలంలోని కమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ పరశురాములు కూతురు సుగుణకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు దక్కింది. ఓయూలో సోషియాలజి డిపార్ట్‌మెంట్‌లో తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర, సామాజిక పరిశీలన అనే అంశంపై డా కే పద్మావతి శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పరిశోధనలకు గాను డాక్టరేట్‌కు ఎంపికచేశారు. డాక్టరేటు రావడంపై మండల ప్రజలు, గ్రామస్తులు అభినందించారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలో కళాకారుడు సాయిచంద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యయాదవ్, మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, నర్సింహ, ప్రవీణ్, జంగయ్య, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దేశిటిక్యాల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వసతి గృహం సందర్శించిన నాయకులు

నాగర్‌కర్నూల్(కొల్లాపూర్): కొల్లాపూర్‌లోని ఎస్సీ ప్రభుత్వ వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వే నివేదికలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కార్మికులకు మానవత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, ఫౌండేషన్ చైర్మన్ డా.రమ్య, డా.దామోదర్ రెడ్డి, శరత్ కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చారకొండ: విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీ టీం ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా ఆపదలో ఉంటే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. మోసాలకు గురైతే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మంజుల, పోలీస్ సిబ్బంది అంజనేయులు, శ్రీశైలం, అరుణాచలం ఉన్నారు.

గ్రూప్–1, 2 పోస్టులు పెంచాలి

నాగర్‌కర్నూల్(కొల్లాపూర్): గ్రూప్–1, గ్రూప్–2 పోస్టుల సంఖ్యను పెంచాలని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు రమేష్, చైతన్య, సింగోటి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డీటీడీఓ ఆకస్మిక తనిఖీ

అచ్చంపేట(మన్ననూర్): స్థానిక గిరిజన బాలుర, ఆశ్రమ బాలికల వసతి గృహాలను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీఓ) కమలాకర్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, వసతి గృహాల పరిసరాలు, డార్మెటరీ, కిచెన్, గదులు, టాయిలెట్స్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఓం ప్రకాష్, మల్లయ్య, మల్లమ్మ, చిట్టిబాయి, దస్లీ, కలమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

అంబులెన్స్ వాహనాన్ని..

నాగర్‌కర్నూల్(తెలకపల్లి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అంబులెన్స్‌ను 108 ప్రోగ్రాం మేనేజర్ మహబూబ్‌రూట్ హెడ్ అనీల్‌ప్రకాష్ తనిఖీ చేశారు. 108 వాహనంలో సౌకర్యాలు పరిశీలించారు. పైలెట్ రాముడు, కురుమూర్తి, గణేష్ పాల్గొన్నారు.

జిల్లా వైభవంపై కవితలకు ఆహ్వానం

నాగర్‌కర్నూల్: జిల్లా సాంఘిక, సామాజిక చారిత్రక వైభవంపై కవితలను ఆహ్వానిస్తున్నట్లు నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన కవులు, కవయిత్రిలు తమ కవితలు, పాటలు, పద్యాలను 40 లైన్లకు మించకుండా రాయాలని సూచించారు. ఆయా కవితలను నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున ఒక సంకలనంగా ప్రచురిస్తున్నట్లు తెలిపారు. ఈ రచనలను జూలై 15వ తేదీలోగా 94927 65358, 94419 46909 నంబర్లకు వాట్సప్ ద్వారా పంపించాలని కోరారు.